సాక్షి ప్రకాశం

ఆదివారం । 24 । డిసెంబర్ । 2023



విషాదం.. విషణ్ణవదనం

పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు సమీపంలో శుక్రవారం కారు–ఆటో ఢీకొని ఆరుగురు మృతిచెందడంతో వారి గ్రామాల్లో తీవ్ర విషాదం నెలకొంది. - 8లో..



శాస్త్రవేత్తలుగా ఎదగాలి

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, విద్యాశాఖ గుంటూరు ఆర్జేడీ సుబ్బారావు పిలుపునిచ్చారు. - 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39/21

దట్టమైన పొగ మంచు ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కొబ్బరి అభివృద్ధికి రూ.10 కోట్లు కేటాయింపు




మాట్లాడుతున్న కుమార్‌వెల్

దర్శి: రాష్ట్రంలో కొబ్బరి అభివృద్ధికి రూ.10 కోట్లు కేటాయించినట్లు కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డ్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.కుమార్‌వెల్ తెలిపారు. స్థానిక ఉద్యానవన పరిశోధనా స్థానంలో కొబ్బరిపంట సాగు, కొబ్బరి విలువ ఆధారిత ఉత్పత్తుల గురించి శనివారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార్‌వెల్ మాట్లాడుతూ జిల్లాలో కొబ్బరి పంట సాగును విస్తరించాలని సూచించారు. రైతులు కనీసం గట్ల వెంట కొబ్బరి మొక్కలు నాటుకోవాలని సూచించారు. సీడీబీ స్కీం ద్వారా ఒక రైతుకు హెక్టారుకు రూ.6,500 నుంచి రూ.15,000 వరకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ ధనుంజయరావు మాట్లాడుతూ కొబ్బరి, దానిమ్మ సాగులో మెళకువల గురించి వివరించారు. ఉద్యానవన శాఖాధికారి రవివెంకన్నబాబు మాట్లాడుతూ రైతులకు అందుతున్న పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో టెక్నికల్ అధికారి వీ గోపిరాజ్, వీఏఏ విష్ణు, జాన్, రవీంద్ర, సోమ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

సోమవారం స్పందన తాత్కాలిక రద్దు

ఒంగోలు టౌన్: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ఈ నెల 25వ తేదీ ప్రభుత్వ సెలవుదినం కారణంగా సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు డీఆర్‌ఓ ఆర్.శ్రీలత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని, సోమవారం స్పందన కార్యక్రమానికి రావద్దని సూచించారు.

టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం.. ప్రజాప్రతినిధి అవినీతితో బకింగ్ హాం కెనాల్‌పై నిలిచిపోయిన హైలెవల్ బ్రిడ్జి పూర్తి చేసేందుకు లైన్ క్లియర్ అయింది. 2016లో ప్రారంభమైన ఈ వంతెన నిర్మాణ పనులు 2018లో పూర్తి కావాల్సి ఉన్నా.. అప్పటి టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తీరుతో పనులు ముందుకు సాగలేదు. ఫలితంగా వంతెన నిర్మాణ అంచనాలు భారీగా పెరిగిపోయాయి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవతో పనులు వేగవంతమయ్యాయి. పెరిగిన అంచనాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.20.57 కోట్లు తీసుకొచ్చేలా కృషి చేశారు. మిగిలిపోయిన పనులు పూర్తి చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.



ఒంగోలు - కొత్తపట్నం రోడ్డులోని బకింగ్ హాం కెనాల్ బ్రిడ్జి

హై లెవల్ వంతెనకు లైన్ క్లియర్

- ఒంగోలు–కొత్తపట్నం రోడ్డులోని బకింగ్‌హాం కెనాల్‌పై బ్రిడ్జి పూర్తి చేసేందుకు మార్గం సుగమం
- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చొరవతో నిధుల కేటాయింపు
- పెరిగిన అంచనాలతో రూ.20.57 కోట్లు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- దామచర్ల పాపం వంతెనకు శాపంగా మారిన వైనం
- 2018 ఫిబ్రవరి 28వ తేదీ నాటికే పూర్తి కావాల్సిన పనులు
- బ్రిడ్జిని అడ్డుపెట్టుకుని నాడు కమీషన్లు దండుకున్న దామచర్ల
- నేడు పనులు పూర్తి కావడం లేదంటూ రాజకీయ డ్రామాలు



కలెక్టర్, ఎస్పీతో కలిసి ఈ నెల 5వ తేదీ బకింగ్ హాం కెనాల్ వంతెనను పరిశీలిస్తున్న సీనియర్ ఐఏఎస్ అధికారి ప్రద్యుమ్న (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఒంగోలు–కొత్తపట్నం రోడ్డులో బకింగ్ హాం కెనాల్‌పై నిర్మిస్తున్న హై లెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు రంగం సిద్ధమైంది. నాటి తెలుగుదేశ ప్రభుత్వం నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల తీరుతో వంతెన నిర్మాణ వ్యయం పెరుగుతూ వచ్చింది. పెరిగిన అంచనాల మేరకు రూ.20.57 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఒంగోలు – కొత్తపట్నం రాకపోకలు సాగించే ప్రజల ఇబ్బందులు తప్పించేందుకు వంతెన నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు అవసరమైన నిధుల కోసం మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఎంతో కృషి చేశారు. సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధులు రాబట్టారు. వాస్తవానికి సకాలంలో వంతెన పనులు పూర్తి చేసి ఉంటే కేంద్ర ప్రభుత్వ నిధులు వెనక్కు పోయేవికావు. 2018 ఫిబ్రవరి 28వ తేదీ నాటికే బకింగ్ హాం కెనాల్ వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయాల్సి ఉంది. కానీ, టీడీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా ఉన్న దామచర్ల జనార్దన్ చేసిన పాపాలు బకింగ్ హాం కెనాల్ వంతెనకు శాపంలా మారాయి. ఆయన అవినీతికి, నిర్లక్ష్యానికి ఈ వంతెన బలైంది. దీంతో కొత్తపట్నం మండల ప్రజలతో పాటు కొత్తపట్నం బీచ్‌కు వెళ్లే ప్రజలు నానా అవస్థలు పడాల్సి వచ్చింది. ఇందుకు ప్రధాన కారణంగా ఉన్న దామచర్ల జనార్దన్‌ను ప్రజలు చీత్కరించుకుంటున్నారు.

2018 ఫిబ్రవరిలోనే పూర్తి కావాల్సిన బ్రిడ్జి...

ఒంగోలు–కొత్తపట్నం ఆర్‌అండ్‌బీ రోడ్డులో ఉన్న బకింగ్ హాం కెనాల్‌పై వంతెన నిర్మాణ పనులు వాస్తవానికి 2018 ఫిబ్రవరి 28వ తేదీ నాటికే పూర్తి కావాల్సి ఉంది. అయితే, దామచర్ల నియంత పోకడతో పనులు ముందుకు సాగలేదు. శిథిలావస్థకు చేరుకుంటున్న పాత వంతెన స్థానంలో కొత్తది నిర్మించాలని టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదికే ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. 2015లో రూ.7 కోట్లతో ప్రతిపాదిత అంచనాలు రూపొందించారు. దానిని కాస్తా రూ.14 కోట్లకు పెంచుతూ 2016 రివైజ్డ్ ఎస్టిమేషన్స్ తయారు చేసి అప్పటి టీడీపీ ప్రభుత్వానికి పంపారు. హైదరాబాద్‌కు చెందిన మెస్సర్స్ కాన్‌టెక్ సిండికేట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ (నంబర్–78/2016) చేసుకుని వంతెన నిర్మాణానికి 2016 ఆగస్టు 31న స్థలాన్ని అప్పగించారు. వంతెన నిర్మాణ పనులు మొత్తం 18 నెలల్లో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు అగ్రిమెంట్ ఇచ్చారు. అంటే, 2018 ఫిబ్రవరి 28వ తేదీతో వంతెన నిర్మాణ పనులు పూర్తి చేసి ఆర్‌అండ్‌బీ అధికారులకు కాంట్రాక్టర్ అప్పగించాల్సి ఉంది. అప్పటికీ టీడీపీ ప్రభుత్వ హయాంలోనే నిధులు సక్రమంగా విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్‌కు 2021 జూన్ 30వ తేదీ వరకు అగ్రిమెంట్ పొడిగించారు.

బ్రిడ్జి పనులు వేగవంతం చేసిందే బాలినేని...

ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి మాత్రం బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కోరుతూ వచ్చారు తప్ప, కాంట్రాక్టర్‌ను ఎక్కడా ఇబ్బంది పెట్టిన దాఖలాలు లేవు. అయితే టీడీపీ హయాంలో పనులు మొదలుపెట్టిన కాంట్రాక్టర్.. ప్రస్తుతం పనులు చేస్తున్న విషయం తెలిసిందే. కాంట్రాక్టర్ వద్ద కమీషన్లకు దామచర్ల జనార్దన్ కక్కుర్తిపడ్డా.. రాజకీయ కుట్రలో భాగంగా పనులు నత్తనడకన జరుగుతున్నాయని గ్రహించిన బాలినేని.. పనులు వేగవంతం చేయాలని, లేదంటే చర్యలు తప్పవంటూ కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. అప్పటి నుంచి పనుల్లో వేగం పెరిగింది. త్వరలో పనులు పూర్తవుతాయని తెలుసుకున్న జనార్దన్ రాజకీయ డ్రామాకు తెరతీశారు. బ్రిడ్జి వద్ద ఆందోళన చేపట్టి తన ఆందోళన కారణంగానే పనులు వేగవంతంగా జరుగుతున్నాయనే కలరింగ్ ఇచ్చుకునే కుయుక్తులకు పథక రచన చేస్తూ వచ్చారు. బాలినేని వంతెన పూర్తి చేసేందుకు ప్రభుత్వం నుంచి నిధులు తెచ్చేందుకు కృషి చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం రూ.20.57 కోట్లు మంజూరు చేసింది. మిగిలిన పనులు పూర్తి చేసేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు సిద్ధమవుతున్నారు. సాధ్యమైనంత త్వరలో పనులు పూర్తి చేసి ప్రజల ఇబ్బందులు తొలగించేందుకు కృషి చేస్తున్న బాలినేనిని ప్రజలు అభినందిస్తున్నారు.

నాడు కమీషన్లకు కక్కుర్తిపడి...

ఆనాడు కమీషన్లకు కక్కుర్తిపడి సొంత సామాజికవర్గానికి చెందిన వ్యక్తికి బ్రిడ్జి కాంట్రాక్టు పనులను దామచర్ల జనార్దన్ అప్పగించారు. పనులు వేగంగా జరుగుతున్నట్లు బిల్డప్ ఇచ్చారు. అతని రాజకీయ డ్రామాలు తెలుసుకున్న ప్రజలు 2019లో జరిగిన ఎన్నికల్లో ఓడించారు. దీంతో నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి పనులను అడుగడుగునా అడ్డుకునే కుట్రలు పన్నుతూనే ఉన్నారు. అందుకు ఒంగోలు నగరం, మండలాల్లో జరిగే ఎన్నో పనులు ఉదాహరణలుగా చెప్పవచ్చు. ప్రజలపై ఉన్న కోపమో, బాలినేనిని ఎదుర్కోలేకపోతున్నాననే బాధో తెలియదుగానీ, ప్రజలపై కక్షసాధింపు చర్యలు చేపడుతూనే ఉన్నారు. కరోనా కారణంగా సుమారు రెండేళ్ల పాటు ప్రజలు అల్లాడిపోయినా హైదరాబాద్‌కు, బెంగళూరుకు దామచర్ల జనార్దన్ పరిమితమయ్యారు తప్ప, జనం ఇబ్బందులు పట్టించుకున్న దాఖలాలు లేవు. కరోనా విజృంభిస్తున్న తరుణంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని మాత్రం నిత్యం ప్రజలతో ఉంటూ జీజీహెచ్‌లో వంద పడకలు ఏర్పాటు చేసి కోవిడ్ బాధితులకు కావాల్సిన ఆక్సిజన్, మందులు, భోజనం ఉచితంగా అందించారు. అంతేగాకుండా నగర ప్రజలందరికీ నిత్యవసర సరుకులు అందిస్తూ వారితో మమేకమయ్యారు. దీన్ని జీర్ణించుకోలేక దామచర్ల జనార్దన్ అండ్ కో.. బాలినేనిపై ఎన్నో కుట్రలు, కుయుక్తులు పన్నుతూనే ఉన్నారు. బాలినేని ఎంతో కష్టపడి ఒంగోలు నగరంలోని 25 వేల మంది నిరుపేదలకు యరజర్ల వద్ద ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు పూనుకుంటే.. కోర్టుకు వెళ్లి వాటిని కూడా ఆపేయించి పేదల ఉసురు పోసుకుంటున్నాడు దామచర్ల. అంతటితో ఆగకుండా ఒంగోలు–కొత్తపట్నం రోడ్డులోని బకింగ్ హాం కెనాల్ బ్రిడ్జి వద్ద ధర్నా అంటూ మరో రాజకీయ డ్రామాకు తెరతీశారు. అసలు బ్రిడ్జి నిర్మాణం విషయానికొస్తే జనార్దన్ జేబులు నింపుకోవడానికే దీన్ని ఉపయోగించుకున్నారు తప్ప, ఏనాడూ చిత్తశుద్ధితో వ్యవహరించిన దాఖలాలు లేవని ఒంగోలు నియోజకవర్గ ప్రజలు మండిపడుతున్నారు.

ఇళ్ల స్థలాల పంపిణీకి బాలినేని కృషి

- కుట్రలతో అడ్డుకున్న టీడీపీ నేతలు
- నగర మేయర్ గంగాడ సుజాత
- వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

ఒంగోలు టౌన్: టీడీపీ మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఆ పార్టీ నేతల కుట్రల కారణంగా ఒంగోలులో నిలిచిపోయిన ఇళ్ల స్థల పట్టాల పంపిణీని ఎలాగైనా పూర్తిచేయాలని స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి శాయశక్తులా కృషి చేస్తున్నారని నగర మేయర్ గంగాడ సుజాత తెలిపారు. అందులో భాగంగానే సెమీ క్రిస్మస్ వేడుకలకు బాలినేని రాలేకపోయారని అన్నారు. వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గం ఆధ్వర్యంలో నగరంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో గల బచ్చల బాలయ్య కళ్యాణ మండపంలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పార్టీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి హాజరై భారీగా తరలివచ్చిన పాస్టర్లతో కలిసి క్యాండిల్ సర్వీస్ నిర్వహించారు. కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పాస్టర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మేయర్ గంగాడ సుజాత ప్రసంగిస్తూ ప్రతిఏటా సెమీక్రిస్మస్ వేడుకలను ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించుకోవడం ఆనవాయితీ అని అన్నారు. ఈసారి ఒంగోలు నగరంలో ఇళ్లు లేని వేలాది మంది నిరుపేద ప్రజలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసే సంకల్పంతో ఆయన బిజీగా ఉన్నందున క్రిస్మస్ వేడుకలకు రాలేకపోయారని చెప్పారు. ఒంగోలులో 25 వేల మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేందుకు ఆయన కృషి చేస్తున్నారని తెలిపారు. అయినప్పటికీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆదేశించారని, ఆయన తరఫున యువ నాయకుడు బాలినేని ప్రణీత్ రెడ్డిని పంపించారని చెప్పారు. ఒంగోలు అభివృద్ధికి బాలినేని కుటుంబం చాలా చేసిందని, రిమ్స్, గుండ్లకమ్మ లాంటివి బాలినేని తీసుకొచ్చినవే అని చెప్పారు. ఒంగోలు ప్రజల దాహార్తి తీర్చడానికి కోట్లాది రూపాయల నిధులు తీసుకొచ్చిన ఘనత కూడా బాలినేనికే దక్కుతుందన్నారు.

నాన్న సంకల్పం నెరవేరాలని ప్రార్థనలు చేయండి : బాలినేని ప్రణీత్‌రెడ్డి

లోకరక్షకుడు ఏసుప్రభు కృపతో జిల్లా ప్రజలకు శుభాలు కలగాలని కోరుకుంటున్నానని బాలినేని ప్రణీత్‌రెడ్డి తెలిపారు. తన తండ్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సంకల్పం నెరవేరాలని పాస్టర్లు ప్రార్థనలు చేయాలని కోరారు. జిల్లా ప్రజలు బాలినేని శ్రీనివాసరెడ్డిని కుటుంబ సభ్యుడిగా భావిస్తూ వాసన్నగా పిలుచుకుంటారని, ఒంగోలు ప్రజల అభిమానం తన జీవిత గమ్యాన్ని మార్చివేసిందని చెప్పారు. 2014 ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న తనపై ఎన్నో నిందలు వేశారని, అయినప్పటికీ కుంగిపోకుండా ప్రజాసేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నానని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బాలినేని గెలుపు కోసం ప్రతిఒక్కరూ బాధ్యతగా తోడ్పాటు అందించాలని కోరారు. మీ ప్రార్థనలు, ఆశీర్వాదాలే మాకు ఎనలేని స్ఫూర్తినిస్తాయని చెప్పారు. లిడ్‌క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇళ్లులేని నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ముస్లింలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు బాలినేని తనవంతుగా ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలతో ముందుకు వెళ్తున్నారని, రాష్ట్రానికి మళ్లీ జగన్ అవసరం ఎంతో ఉందని అన్నారు. తొలుత పాస్టర్ కృపాకర్ ప్రార్థనతో సభను ప్రారంభించారు. కార్యక్రమంలో మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కనకారావు, సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, సాంస్కృతిక విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ బొట్ల సుబ్బారావు, పాస్టర్లు భగవాన్‌దాస్, సామ్రాట్, ఐజాక్‌బాబు, వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్ కఠారి శంకర్, నాయకుడు గొర్రెపాటి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు తాడి కృష్ణలత, గోలి లక్ష్మీకోటేశ్వరమ్మ, పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, సువర్ణ, బడుగు ఇందిర, గోలి తిరుపతిరావు, పాస్టర్లు, పలువురు నాయకులు, క్రైస్తవులు పాల్గొన్నారు.



సెమీక్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న మేయర్ గంగాడ సుజాత, బాలినేని ప్రణీత్‌రెడ్డి, కాకుమాను రాజశేఖర్, కనకారావు, వైఎస్సార్ సీపీ నాయకులు

క్లుప్తంగా

26న మార్షల్ ఆర్ట్స్ జట్ల ఎంపిక

ఒంగోలు: ఈనెల 26న తంగాట మార్షల్ ఆర్ట్స్ క్రీడాజట్ల ఎంపిక యద్దనపూడి మండలం పూనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కె.వనజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని అండర్– 14 అండర్– 17 బాల బాలికల జట్ల ఎంపిక నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 9 గంటలకు ఎంపిక ప్రక్రియ ప్రారంభం అవుతుందని చెప్పారు. పీఈటీలు/ పీడీలు ఆసక్తి కలిగిన విద్యార్థులతో ఆన్‌లైన్ ఎంట్రీ చేయించి మాన్యువల్ ఎంట్రీఫారంతో ఎంపికకు హాజరుకావాలని చెప్పారు. అండర్ 17 కేటగిరీలో పాల్గొనే ఇంటర్ విద్యార్థులు పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు, జ్ఞానభూమి చైల్డ్ ఐడీ నెంబర్, సంబంధిత ప్రిన్సిపాల్ ధ్రువీకరణతో నిర్వాహకులకు సమర్పించాలన్నారు. పూర్తి వివరాలకు టి.అంకరాజు, సెల్ నెంబర్ 9493923121ను సంప్రదించాలని ఈ సందర్భంగా తెలిపారు.

చికిత్స పొందుతూ భార్యభర్తలు మృతి


అంజయ్య


టంగుటూరు: ఈ నెల 18న పొందూరు ఎస్సీ కాలనీలో గ్యాస్ సిలిండ్ పేలడంతో ముగ్గురికి తీవ్రగాయాలైన ఘటన విదితమే. కాగా చికిత్స పొందుతూ భార్య భర్తలు శనివారం మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పొందూరు ఎస్సీ కాలనీకి చెందిన గొర్రెముచ్చు బాలకోటయ్య, భార్య ఈశ్వరమ్మ గ్యాస్ పొయ్యి పాడవ్వడంతో మరమ్మతులు చేస్తుండగా ప్రమాదంలో జరిగింది. ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో ఒంగోలు జీజీహెచ్‌కు అనంతరం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఈశ్వరమ్మ ఈ నెల 20న మృతి చెందగా పంచనామా అనంతరం గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. భార్య మరణించిన వార్త విన్న బాలకోటయ్య (69) శనివారం మృతి చెందాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరమ్మతులు చేసిన వ్యక్తి అంజయ్య ఒంగోలు ప్రైవేటు ఆసుపత్రికిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

గ్యాస్ ట్యాంకర్‌ను ఢీకొన్న టిప్పర్


లారీ డ్రైవర్‌ను బయటకు తీస్తున్న జాతీయ రహదారి, ఫైర్ పోలీసు సిబ్బంది

టంగుటూరు: టిప్పర్ డ్రైవర్ నిద్రమత్తులో ఆగి ఉన్న గ్యాస్ ట్యాంకర్‌ను వెనుక నుంచి ఢీకొట్టగా టిప్పర్ డ్రైవర్ లారీలో ఇరుక్కుపోయిన సంఘటన స్థానిక టోల్ ప్లాజా సమీపంలో శనివారం చోటు చేసుకుంది. జాతీయ రహదారి పోలీసులు వివరాల మేరకు.. ఒంగోలు నుంచి నెల్లూరు వైపు టిప్పర్ బయలుదేరింది. మార్గ మధ్యంలో టోల్ ప్లాజా సమీపంలో పక్కన్న ఆగి ఉన్న గ్యాస్ ట్యాంకర్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో టిప్పర్ లారీ డ్రైవర్ క్యాబిన్లో ఇరుక్కుపోయాడు. తీవ్రగాయాలైన డ్రైవర్ పెరమాల నాగలక్ష్మయ్యను ఫైర్ పోలీసు, జాతీయ రహదారి పోలీసులు అతి కష్టం మీద బయటకు తీసి చికిత్స నిమిత్తం అంబులెన్సులో జీజీహెచ్‌కు తరలించారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఇన్‌చార్జి ఎస్సై శ్రీరామ్ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

జబరాజంగి లఘు చిత్రం షూటింగ్ ప్రారంభం


జబరాజంగి చిత్రం ప్రారంభమైన దృశ్యం

ఒంగోలు టౌన్: ఎన్నో ప్రతిష్టాత్మకమైన లఘు చిత్రాలను నిర్మించిన సుహారి ఎంటర్‌టైన్‌మెంట్స్ ఓటీటీ వేదికగా చేసుకొని ప్రయోగాత్మకంగా జబరాజంగి చిత్రానికి శ్రీకారం చుట్టింది. శనివారం ఈ చిత్రానికి ఒంగోలులోని రామాలయంలో క్లాప్ కొట్టి ప్రారంభించారు. పూజా కార్యక్రమాలను నిర్వహించిన రవి శంకర్ గ్రూప్ అధినేత కంది రవిశంకర్ కెమెరా స్విచాన్ చేశారు. జిల్లా నీటి యాజమాన్యం సంస్థ ప్రాజెక్టు డైరక్టర్ శీనారెడ్డి క్లాప్ కొట్టారు. సాధనాల సురేష్ బాబు కథా నాయకుడిగా అనూష కథానాయకిగా, దాసరి శ్రీనివాస్ భార్గవ్ ప్రతినాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రాన్ని సుహారి ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై పిన్నింటి నాయుడు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. బండారు రవితేజ దర్శకత్వం వహిస్తున్నారు. కలిలోకంలో కర్ణుడి కథ కర్మ సిద్ధాంతం ఆధారంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు దర్శకుడు రవితేజ తెలిపారు.

విషాదం.. విషణ్ణవదనం

- ఘోర రోడ్డు ప్రమాదంలో విగతజీవులుగా బాధితులు
- అభినయ్, రత్నతేజ తల్లిదండ్రుల గుండె కోత
- రోదిస్తున్న డ్రైవర్ అబ్దుల్ హుస్సేన్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ డానియేల్ కుటుంబ సభ్యులు

త్రిపురాంతకం: పెద్దారవీడు మండల పరిధిలోని దేవరాజుగట్టు వద్ద శుక్రవారం కారు– ఆటో ఢీ కొట్టుకున్న ప్రమాదంలో ఆరుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. ఇందులో మండలానికి చెందిన అన్నదమ్ములిద్దరూ క్రిస్మస్ పండుగకు దుస్తులు కొనుగోలు చేసేందుకు మార్కాపురం బయలు దేరి వెళ్లి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. వీరి మృతదేహాలను స్వగ్రామం దూపాడు తీసుకు రాగా ఆ ప్రాంతమంతా బంధువుల రోదనలతో మారుమోగింది. దూపాడు గ్రామానికి చెందిన అభినయ్ ప్రమాద స్థలంలోనే మృతి చెందగా, సోదరుడు రత్నతేజను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అప్పటి వరకు తమ ముందు ఆటలాడుతూ కనిపించిన చిన్నారులు ఇకలేరని తెలియడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ప్రైవేటు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ఎనిబెర పెద్ద లాజరు, ఉమ దంపతులకు ఇద్దరు కుమారులు. అభినయ్ రాజంపల్లిలోని కేంద్రీయ విద్యాలయంలో 6వ తరగతి చదువుతుండగా, తమ్ముడు రత్నతేజ మార్కాపురం ప్రైవేటు పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నారు. క్రిస్మస్ పండగను ఆనందంగా జరుపుకునేందుకు స్వగృహం వద్ద అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. పిల్లలకు దుస్తులు కొనుగోలు కోసం రావాల్సిందిగా చెప్పిన లాజరు ముందుగా మార్కాపురం వెళ్లాడు. అయితే పిల్లలు ఇద్దరూ కుంట వరకు వచ్చి మరో ఆటోలో మార్కాపురం బయలుదేరి ప్రమాదానికి గురయ్యారు. అప్పటికే అభినయ్ మృతి చెందాడని, రత్నతేజ తీవ్ర రక్తస్రావంతో ప్రాణాపాయ స్థితిలో ఉండి అన్న కోసం ఆరాటపడటం చూసి వారు భోరున విలపించారు. హుటాహుటిన వైద్యశాలకు తరలించినా ఫలితం దక్కలేదు.

కుటుంబ సభ్యులకు పరామర్శ

ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ నాసర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ ఎనిబెర శైలజ వారి వెన్నంటే ఉండి కుటుంబానికి అండగా నిలిచారు. పలువురు ప్రముఖులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. తహసీల్దార్ వి. కిరణ్, ఎంపీడీఓ సాంబశివరావు, ఎంఈఓలు కె. తులసిమల్లికార్జున నాయక్, టి. రాజశేఖరరెడ్డి ఉన్నారు. డీఎస్పీ వీరరాఘవరెడ్డితో మాట్లాడి శవ పంచనామా పూర్తి చేయించారు. సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి, పోలీసు అధికారులు ప్రత్యేక చొరవ చూపారు.

నా గుండెను తీసి పిల్లలకు పెట్టండయ్యా..


అభినయ్ (ఫైల్)


రత్నతేజ (ఫైల్)


రోదిస్తున్న అభినయ్, రత్నతేజల తల్లి ఉమ


మృతులు అభినయ్, రత్నతేజ ఇంటి వద్ద గుమిగూడిన జనం

మార్కాపురం: 'నాకు నా ఇద్దరు పిల్లలు కావాలి... వారు లేనిదే నేను ఉండలేను. వారిని బతికించేందుకు నా గుండెను తీసి పెట్టండయ్యా' అంటూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అభినయ్, రత్నతేజ తల్లి ఉమ రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. 'నా పిల్లలకు టిఫిన్ పెట్టనిదే నేను తినను. వారితోనే నా జీవితం' అంటూ పోస్టుమార్టం రూంలో విగత జీవులుగా పడి ఉన్న కుమారులను చూసి తండ్రి లాజరుతోపాటు తల్లి ఉమ తల్లడిల్లిపోయింది. 'వారికోసమే మేమిద్దరం బతుకుతున్నాం. స్కూల్ నుంచి వస్తే ఇంటిలో నా వెంటే తిరుగుతారు. ఏ మాత్రం గోలచేయరు. చెప్పిన మాట వింటారు. నేనెవరికోసం బతకాలయ్యా' అంటూ దుఃఖిస్తున్న కన్నవారిని ఓదార్చడం ఎవరితరమూ కాలేదు. శనివారం ఉదయం మృతుల కుటుంబ సభ్యుల రోదనలతో వైద్యశాల మిన్నంటింది.

4 నెలల క్రితమే కువైట్ నుంచి..


మృతి చెందిన డ్రైవర్ బాబు (ఫైల్)


డ్రైవర్ బాబు కుటుంబ సభ్యులు

ప్రమాదంలో మృతి చెందిన ఆటో డ్రైవర్ షేక్ అబ్దుల్ హుస్సేన్ అలియాస్ బాబుది మార్కాపురం. నాలుగు నెలల క్రితమే దుబాయ్ నుంచి వచ్చి ఆటో బాడుగకు తీసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య రమీజాబీ, కూతుర్లు ఆరీఫా, రబియా ఉన్నారు. శుక్రవారం కూడా యథావిధిగా ఆటో తీసుకుని సాయంత్రం కల్లా వస్తానని కూతుర్లతో చెప్పి వెళ్లిన బాబు తిరిగిరాని లోకాలకు వెళ్లాడని పిల్లలిద్దరూ తండ్రి మృతదేహం చూసి విలపించారు. ఇక మా కుటుంబానికి దిక్కెవరంటూ రోదించారు. ఇలా మృతుల కుటుంబ సభ్యుల ఆర్తనాదాలతో వైద్యశాలంతా విషాదకర వాతావరణం నెలకొంది.


దూపాడులో మృతులు, వారి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీపీ, సర్పంచ్

ఆదుకుంటాం

- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను ఆదుకుంటామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంఘటన తనను తీవ్రంగా కలచివేసిందని, ఇది హృదయ విదారక సంఘటన అని తెలిపారు. మృతుల కుటుంబాలను త్వరలోనే తాను కలిసి పరామర్శిస్తానని, వారికి అండగా ఉంటామని ఆయన తెలిపారు. దేవుడు ఆ కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని కోరుకుంటున్నానంటూ సంతాపం ప్రకటించారు.

గృహ ప్రవేశానికి హాజరై తిరిగి వెళుతుండగా..

కొమరోలు: తమ దాయాది గృహ ప్రవేశానికి హాజరై వేడుకల్లో ఆనందంగా గడిపిన కుటుంబం రహదారి ప్రమాద రూపంలో రెండు నిండు ప్రాణాలను బలికొంది. కొమరోలు మండలం వర్ధనపల్లి గ్రామానికి చెందిన రాయి వెంకటేశ్వర్లు (62), రాయి నాగేశ్వరరావు (55) 40 సంవత్సరాల క్రితం గుంటూరులో వ్యాపారం చేస్తూ అక్కడే స్థిరపడ్డారు. శుక్రవారం దాయాది రాయి చిన్న వెంకటేశ్వర్లు గృహ ప్రవేశం జరిగిన నేపథ్యంలో తన సోదరులను ఆహ్వానించాడు. ఈనేపథ్యంలో కొమరోలులో గృహ ప్రవేశానికి శుక్రవారం ఉదయం వీరిరువురు హాజరయ్యారు. మధ్యాహ్నం వరకు బంధుమిత్రులతో సరదాగా, ఆనందంగా గడిపిన ఇరు కుటుంబాలు భోజనం చేసిన అనంతరం గుంటూరుకు తిరుగు ప్రయాణం అయ్యారు. పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు గ్రామం వద్ద వీరు ప్రయాణిస్తున్న కారు, ఆటో ఎదురుగా ఢీకొనడంతో ఇరువురు సోదరులు అక్కడికక్కడే మృతి చెందారు. రాయి నాగేశ్వరరావు కుమారుడు నారాయణ 3 సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. రహదారి ప్రమాదంలో ఇరువురు మృత్యువాత పడటంతో వర్ధనపల్లె గ్రామంలో కొమరోలులో విషాద ఛాయలు అలముకున్నాయి.

విగతజీవిగా మారిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందిన ఉప్పలపాటి డానియేల్ స్వగ్రామం పెద్దదోర్నాల మండలం గంటవానిపల్లి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఆటోలో వస్తూ తీవ్ర గాయాలు కాగా జిల్లా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందడటంతో భార్య మోహన కుప్పకూలిపోయింది, కుమారుడు రెండేళ్ల డానియేల్ పరిస్థితి ఏమిటంటూ కుమిలిపోయింది. తీవ్రంగా గాయపడిన అగ్రికల్చర్ విద్యార్థినులు మైథిలి, ముషీదా, కమ్రాన్‌లు కర్నూల్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ, పక్కన ఆర్జేడీ సుబ్బారావు, విద్యాశాఖాధికారులు


విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే కేపీ, పక్కన విద్యాశాఖాధికారులు

మార్కాపురం టౌన్: విద్యార్థులు చదువుతో పాటు సమాజానికి ఉపయోగపడే పరిశోధనలను చేస్తూ శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, గుంటూరు విద్యాశాఖ ఆర్జేడీ సుబ్బారావు అన్నారు. శనివారం జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. జిల్లా స్థాయికి 190 ఆవిష్కరణలు వచ్చాయని వీటిలో వ్యక్తిగత, గ్రూపు క్యాటగిరితోపాటు 38 టీచర్ క్యాటగిరీలు వచ్చాయన్నారు. ముందుగా టెట్రా సైక్‌లెన్ కనుగొన్న తెలుగు శాస్త్రవేత్త డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, డీఎల్‌డీఓ సాయికుమార్, డిప్యూటీ డీఈఓలు చంద్రమౌళీశ్వర్, అనీ తారోజ్ రాణి, ఎంపీడీఓ చందన, జాతీయ ఉత్తమ సైన్స్ అవార్డు గ్రహీత జగన్నాథ్, ఎంఈఓలు రాందాస్ నాయక్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

100 శాతం ఉత్తీర్ణతపై ప్రత్యేక దృష్టి

మార్కాపురం: వచ్చే ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల్లో జరిగే విద్యార్థుల 100 శాతం ఉత్తీర్ణతపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు డీఈఓ సుబ్బారావు తెలిపారు. శనివారం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. 38 మండలాల్లో 29,466 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారన్నారు. ప్రత్యేక స్టడీ అవర్స్‌తోపాటు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, డిప్యూటీ డీఈఓ చంద్రమౌళీశ్వర్, హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఈఓలు రాందాస్ నాయక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సైన్స్ ఫెయిర్ విజేతలు

మార్కాపురం టౌన్: వ్యక్తిగత క్యాటగిరీలో మొదటి బహుమతిని జి. శివకౌశిక్, డి. సాత్విక్, సీహెచ్ దేవరాజు, రెండో బహుమతిని జీవీ అభిరామ్, బి. లక్ష్మీ ప్రియ, కె. గౌతమి, మూడో బహుమతిని సీహెచ్ వసంతకుమార్, డి. నివాస్, కె. నితీష్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. గ్రూపు క్యాటగిరీలో మొదటి బహుమతి ఎస్‌కే జమీర్, మణికంఠ, వెంకట్, నరసింహ, కె. శ్రావణి, ఇ. శ్రీజ, ద్వితీయ బహుమతిని డి. ధనలక్ష్మి, హారిక, ఎస్ నిఖిల్, కె. శ్రీనివాసులు, టి. వీరబ్రహ్మం, తృతీయ బహుమతిని ఎం. అంజలి గెలుపొందారు.

టీచర్స్ క్యాటగిరీలో..

ప్రథమ బహుమతి ఎం. లక్ష్మీ కాంతమ్మ, పి. ప్రమీల , కె. రాము, ద్వితీయ బహుమతిని కె. పద్మజ, కె. స్వర్ణలత, ఎస్.కె సికిందర్ బాషా, తృతీయ బహుమతిని జి. రాజగోపాల్, ఏ. ఉమా మహేశ్వరి, జి. ప్రభాకర్ విజేతలుగా నిలిచారు. సైన్స్‌ఫెయిర్‌కు హాజరైన విద్యార్థులకు పార్టిసిపేషన్ బహుమతులను అందించారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా, ఆర్జేడీ సుబ్బారావు, పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి, విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


బహుమతి అందిస్తున్న ఆర్జేడీ సుబ్బారావు


విద్యార్థికి బహుమతి అందిస్తున్న ఎంపీపీ పోరెడ్డి అరుణాచెంచిరెడ్డి


ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ సిస్టం నమూనా


వాటర్ మేనేజ్‌మెంటు షెడ్యులర్


పాము కాటు నుంచి రక్షణ పొందే లైఫ్ సేవర్ స్టిక్ నమూనాతో ఉదయ్



ధరణిలో ధన్వంతరులు నమూనాతో విద్యార్థిని తులసి


విద్యార్థి నమూనాకు పాయింట్లు వేస్తున్న న్యాయనిర్ణేతలు


ప్రాజెక్టుల నమూనాలను తిలకిస్తున్న విద్యార్థులు

వేగవంత రైలు ప్రాజెక్టులపై మాగుంట ప్రశ్న

ఒంగోలు: వేగవంత రైలు ప్రాజెక్టుల ఏర్పాటుపై పార్లమెంట్‌లో మాగుంట ప్రశ్నకు కేంద్ర రైల్వే, ప్రసార, ఎలక్ట్రానిక్స్, సాంకేతిక సమాచార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సమాధానం ఇచ్చారు. దేశంలో మొత్తంలో ప్రస్తుతం ముంబై-అహ్మదాబాద్ వేగవంత రైలు ప్రాజెక్టు ఒక్కటే నిర్మాణంలో ఉందన్నారు. దీనికి సాంకేతిక, ఆర్థిక సాయాన్ని జపాన్ ప్రభుత్వం అందజేసిందని, ఈ ప్రాజెక్టు గుజరాత్, మహారాష్ట్ర, దాద్రా నగర్ హవేలి కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి వెళుతుందన్నారు. మొత్తం ప్రాజెక్టు విలువ రూ. 1,08,000 కోట్లకు గాను రూ. 48,695 కోట్లు ప్రభుత్వం విడుదలచేయడం , మొత్తం సివిల్ పనుల ఒప్పందాలు పూర్తయ్యాయన్నారు. ప్రస్తుతానికి 180 కిలోమీటర్లు స్తంభాలు –అడ్డుగోడ పనులు, 255 కిలోమీటర్ల పునాది పనులు, 138 కిలోమీటర్ల మేర వంతెన కాస్టింగ్ పనులు, 107 కిలోమీటర్ల మేర వంతెన పనులు పూర్తి చేశామన్నారు. మొత్తం ప్రాజెక్టు పనులను ప్రాజెక్టు మానిటరింగ్ గ్రూపు తదితర ముఖ్య వేదికలు సమీక్షిస్తాయని కేంద్ర మంత్రి వివరించారు.

జనవరి 6లోపు దరఖాస్తు చేయాలి

ఒంగోలు టౌన్: జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం జనవరి 6వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మీడియా సంస్థల్లో పనిచేస్తూ అక్రిడిటేషన్ కలిగిన అర్హులైన జర్నలిస్టులకు హౌసింగ్ స్కీం కింద స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం జీఓ విడుదల చేసిందని తెలిపారు. నిబంధనల ప్రకారం అక్రిడిటేషన్ కార్డు పొందిన జర్నలిస్టుల వివరాలు, వృత్తి అనుభవాన్ని విజయవాడలోని సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయం పరిశీలించిన అనంతరం ప్రాథమికంగా ధ్రువీకరించామన్నారు. ఇప్పటి వరకు 136 మంది అర్హులైన జర్నలిస్టుల వివరాలను జిల్లాకు పంపించినట్లు వివరించారు. తదుపరి దశలో వీటిని జిల్లా ఇన్‌చార్జి మంత్రి చైర్మన్‌గా వ్యవహరించే కమిటీ పరిశీలించి అవసరమైన వెరిఫికేషన్ అనంతరం అర్హులకు ఇళ్ల స్థలాలను మంజూరు చేయనున్నట్లు తెలిపారు.